# సింగిల్ పేజీ కథలు

## రూల్సొప్పుకోవు

అనూహ్యం! అద్భుతం!! నమ్మశక్యం కానిది!? అయినా ప్రత్యక్షంగా చూస్తున్నాం కాబట్టి నమ్మక తప్పటం లేదు.

ఈరోజునుండి అవినీతికి దూరంగా ఉంటామని వివిధ వర్గాల ప్రతినిధులు లాంఛనంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహత్తర ఘట్టం.

★ ★ ★

"కరెంట్ బిల్లొచ్చిందండీ" సత్యనారాయణ ఆఫీసు నుండి వస్తూనే ఎదురెళ్ళి ఆందోళనగా చెప్పింది వనజాక్షి.

"రేపు ఆఫీసుకెళ్ళేప్పుడు కడతాన్లే" తాపీగా అంటూ వనజాక్షి మొహం చూడకుండానే డ్రెస్ మార్చుకునేందుకు బెడ్‌రూంలో కెళ్ళాడు.

"అదికాదండీ బిల్లు లక్ష రూపాయలొచ్చిందండీ"

ఒక్కసారిగా షాక్ తగిలినట్లు వెనక్కి తిరిగి వనజాక్షి నుండి బిల్లు లాక్కున్నాడు. ముఖంలో రక్తం ఇంకిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టింది. అలాగే మంచంపై కూర్చుండిపోయాడు. ఏదో తట్టినట్లయి బిల్ వైపు చూశాడు. "ఏం లేదోయ్. వెయ్యి రూపాయలై వుంటుంది. కంప్యూటర్ పారపాటు వల్ల రెండు సున్నాలు ఎక్కువగా పడివుంటాయి" అంటూ భార్యకు ధైర్యం చెప్పాడు.

మర్నాడు సత్యనారాయణ కరెంటాఫీసుకు వెళ్ళి సంబంధిత సెక్షన్‌లో కలిశాడు. ముందు బిల్లు కట్టిం తర్వాతనే సరిచేస్తామని అంతకుముందు సరిచెయ్యటానికి నిబంధనలు అంగీకరించవని చెప్పాడు సెక్షనాఫీసర్.

"సార్ గుమాస్తాగాడ్ని- లక్ష రూపాయలు ఎలా కట్టగలను. లక్ష రూపాయల బిల్లు ఇంటికి రాదని పారపాటున పడివుంటుందని మీరేగదా సార్ అన్నారు. అంత డబ్బు నాకు అప్పుగా కూడా పుట్టదు సార్" అంటూ లబలబలాడాడు సత్యం.

ఎంత చెప్పినా రూల్సొప్పుకోవన్నాడు సెక్షనాఫీసర్. ఇంక లాభం లేదని క్యాంటీన్‌కు వెళదాం రండని పిలిచాడు సత్యం సెక్షనాఫీసర్‌ని- ఎంతోకొంత ముట్టచెప్పి దొడ్డిదారిన సమస్యను పరిష్కరించుకుందామని.


సెక్షనాఫీసర్ ఒక చిరునవ్వు నవ్వి "మరచిపోయారా సార్ నిన్నటినుండి అమ్యామ్యాలు తీసుకునేది లేదని ప్రతిజ్ఞ చేశాం" అని అన్నాడు.

"మరెలా సార్" అంటూ బేలగా అడిగాడు.

"లక్ష రూపాయలు కట్టింతర్వాతనే వినతిపత్రం పెట్టుకుంటే విచారణ జరిపి బిల్లు తప్పయితే మీ డబ్బు మీకు తిరిగి చెల్లిస్తారు. లేదంటే రాబోయే బిల్లుల్లో సర్దుతారు. అంతకంటే వేరే మార్గమే లేదు"

దిగాలుగా యింటికి చేరుకున్న భర్తను చూసి వనజాక్షి చాలా కంగారుపడిపోయింది. పొద్దుటికీ ఇప్పటికీ భర్త సగానికి సగం అయినట్లు తోచింది. జరిగింది భార్యకు చెప్పాడు. తన కొలీగ్‌కు కూడా టెలిఫోన్ బిల్లు పొరపాటున అయిదువేలకు బదులు యాభై వేలు వచ్చిందనీ అక్కడ కూడా యిలాగే అన్నారని చెప్పాడు సత్యం.

మనసంతా దిగులుగా వుండటంతో ఆఫీసుకు కాస్త



ఆలస్యంగా బయలుదేరాడు సత్యం. కొంతదూరం వెళ్ళాడో లేదో వాహనాలన్నింటినీ పోలీసులు ఆపి తనిఖీ చేస్తున్నారు. సత్యం కూడా తన మోటార్ సైకిల్‌ను పక్కకు నిలిపాడు. కాగితాలన్నీ చూసిం తర్వాత ఎస్సై పొల్యూషన్ సర్టిఫికెట్ ఏదని అడిగాడు.

"సార్ కొత్త వెహికిల్ సార్. మూడునెలలే అయింది సార్ కొని. పొల్యూషన్ లేదు సార్" అని నీళ్ళు నమిలాడు సత్యం.

సర్టిఫికెట్ లేకుంటే మూడొందలు కట్టండని బిల్లు రాయబోతుంటే కంగారుగా ఆపాడు సత్యం. సార్ మూడొందలెందుకు- ఓ యాభై తీసుకుని వొదిలెయ్యండని బలవంతంగా నవ్వు అతికించుకుని అన్నాడు.

అందుకు ఎస్సై చిరునవ్వు నవ్వి 'ప్రతిజ్ఞ సార్' అంటూ గుర్తుచేశాడు. నవ్వలేక ఏడ్వలేక మూడొందలు కట్టి రశీదు తీసుకున్నాడు సత్యం.

ఆఫీసుకెళ్ళి సీట్లో కూర్చోగానే ఛీఫ్ ఇంజినీర్‌గారు పిలుస్తున్నారని ప్యూన్ వచ్చి చెప్పాడు సత్యానికి.

"టెండర్ కొటేషన్స్ యింకా పుటప్ చెయ్యలేదేం-గడువు ముగిసి మూడురోజులైంది కదా" ఛాంబర్‌లోకి వెళ్ళటంతోనే గర్జించాడు సి.ఇ.

"సార్ ఒక్క కొటేషన్ కూడా రాలేదు. అందుకే పుటప్ చెయ్యలేదు" చేతులు నలుపుకొంటూ చెప్పాడు సత్యం.

"వ్వాట్..ఒక్కటి కూడా రాలేదా" అదిరిపడ్డాడు సి.ఇ.

"లంచాల పద్ధతి లేకుండా కాంట్రాక్టు పనులు చెయ్యటం గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లందరూ వేరే పనులు చూసుకుంటున్నట్లు తెల్సింది సార్"

ఆలోచనలో పడిపోయాడు సి.ఇ. సత్యం బయటికి జారుకున్నాడు.సాయంత్రం ఓ గంట ముందుగానే పర్మిషన్ తీసుకుని మున్సిపాల్టీ ఆఫీసుకు వెళ్ళాడు సత్యం. అంతకు ముందెప్పుడో బ్రోకర్ ద్వారా గృహనిర్మాణానికి అనుమతి కోరుతూ దరఖాస్తు చేయించాడు. గుమాస్తా ఫైళ్ళన్నీ వెతికి సత్యం పెట్టుకున్న దరఖాస్తును తీశాడు.

"ప్చ్..మీకు అనుమతి రాదు" అని చప్పరించేశాడు.

మీద పిడుగు పడ్డట్లయింది. "అదేంటి సార్ తప్పకుండా వస్తుందని బ్రోకర్ చెప్పాడు. మీరేమో రాదని అంటున్నారు" ఆందోళనగా అడిగాడు గుమాస్తాను.

"అది ప్రతిజ్ఞకు ముందుసార్. ఇప్పుడు ఈ రూల్సన్నీ మీరు పాటించటం అసాధ్యం" అంటూ ఫైల్‌ని సత్యం ముందుకు తోశాడు. ఈ కింద పేర్కొన్న పదిహేను నియమాల్ని పాటించినట్లయితే అనుమతి మంజూరవుతుందని పచ్చసిరాతో నోట్ రాసివుంది.

లిస్టంతా చదివేసరికి సత్యంకు కళ్ళకు చీకట్లు కమ్మాయి. నీరసంగా లేచి నిలబడ్డ సత్యం వైపు జాలిగా చూశాడు గుమాస్తా.

"ప్రతిజ్ఞ రెండురోజులు ఆలస్యమైతే మీకు పర్మిషనొచ్చేది.." సత్యం వస్తూంటే గుమాస్తా ఏదో చెబుతున్నాడు.

★ ★ ★

ఏ యిద్దరు కల్సినా ప్రతిజ్ఞ తర్వాత జరుగుతున్న సంఘటనలనే చెప్పుకుంటున్నారు. మంచి జరుగుతుందని అందరూ సంతోషిస్తే యిలా జరుగుతోందేమిటి. సత్యం మనస్సంతా చికాకుగా గందరగోళంగా వుంది. ఆఫీసు స్టాఫంతా క్యాంటీన్‌లో చేరి యిదే విషయాన్ని చర్చించుకుంటున్నారు.

సత్యం స్నేహితుడు శంకరం వాళ్ళింట్లో జరిగిన దొంగతనం గురించి చెబుతున్నాడు. "డబ్బు తీసిందెవరో మాకు తెలుసు. పోలీసులకు చెబితే పిలిపించి అడిగారు. డబ్బు తీశావా అంటే తియ్యలేదని చెప్పాడు. అదేమిటి సార్ దొంగలను అలా మర్యాదగా అడిగితే ఎట్లా...నాలుగు తగిలిస్తే ఒప్పుకుంటాడని అంటే రూల్సొప్పుకోవని పోలీసాఫీసర్ సమాధానం. ఇదీవరస. నేరగాళ్ళు యిది చూసి మరీ రెచ్చిపోతున్నారనుకో."

వింటున్న అందరి ముఖాల్లోను భయం ప్రస్ఫుటంగా

కనిపిస్తోంది. తమకు ఎదురైన అనుభవాలను అంతా చెప్పుకొస్తున్నారు.

పనులు సవ్యంగా సాగుతాయనుకుంటే పూర్తిగా నిలిచిపోతున్నాయేమిటి. సత్యం బుర్రలో వెంటనే ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. "ఫ్రెండ్స్" అంటూ గట్టిగా అరిచాడు సత్యం.స్టాఫ్ అందరూ ఒక్కసారిగా సత్యం వైపు చూశారు.

సత్యం ఉపన్యాసం యిస్తున్న ధోరణిలో "ఫ్రెండ్స్...యివ్వాళ తలెత్తిన విచిత్ర పరిణామాలకు మూలం మనం యిప్పటికీ బ్రిటిష్‌వాళ్ళు పెట్టిన రూల్స్‌నే పాటించటం. ఆ రూల్స్‌ను యధాతథంగా పాటించటం అసంభవం. మరి పనులు జరగాలి కాబట్టి 'లంచం' అనే వ్యవస్థ ఏర్పడింది. మరి మనం ఏం చేశాం..లంచాన్ని ద్వేషించాం. ఇప్పుడేమైందో చూశారు కదా. లంచం సమాజాన్ని పట్టి పీడించే క్యాన్సర్ కాదు. అదొక దివ్యౌషధం. కాదు..కాదు..వజ్రాయుధం. కాబట్టి మిత్రులారా..ప్రతిజ్ఞను రద్దు చెయ్యాలని, ప్రతిజ్ఞ పూర్వస్థితిని యధాతథంగా కొనసాగించాలని ఉద్యమం ప్రారంభించాలి."

"ప్రతిజ్ఞను రద్దు చెయ్యాలి"

"లంచాలు వర్థిల్లాలి"

"లంచం జిందాబాద్"

వంటగదిలో వున్న వనజాక్షి ఆ అరుపులు విని కంగారుగా బెడ్‌రూం వైపు పరుగెత్తింది. భర్త చేతిలో దినపత్రిక వుంది. ఏదో ట్రాన్స్‌లో వున్నట్లుగా నినాదాలు చేస్తున్నాడు.

"ఏమండీ..ఏమండీ..ఏమైంది మీకు" అంటూ వనజాక్షి గట్టిగా కుదిపింది భర్తను. ఆ కుదుపులకు సత్యం తేరుకున్నాడు.అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన వార్తను చదువుతూ అలా ఊహల్లోకెళ్ళిపోయాడు సత్యం."అబ్బ యిదంతా ఊహేనా..ఎంత భయపడ్డాను" అనుకున్నాడు సత్యం.

**-సి.జయపాల్‌రెడ్డి (కాజీపేట)**

# మార్పు

ఆ రోజు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలు అవుతోంది. కాంతి తన ఇద్దరి పిల్లలతో బెంగుళూరు నుండి అప్పుడే వచ్చింది. దసరా సెలవులకి హైదరాబాద్ రమ్మని తమ్ముడు నిఖిల్ ఆహ్వానించటంతో కాదనలేకపోయింది కాంతి. "నీవు పెళ్ళికి రాలేకపోయావు కదా అక్కా మరి నీ మరదల్ని చూడాలని లేదా నీకు" అన్నాడు నిఖిల్. అందుకే కాంతి ఇంకే అభ్యంతరమూ చెప్పకుండా ఒప్పేసుకుంది. తమ్ముడి భార్య శిల్పని చూడగానే కాంతి భయాలన్నీ పటాపంచలయిపోయాయి. వదినగారూ అంటూ నోరారా పిలవటం, చిరునవ్వుతో పలకరించటం చూశాక ఆమె కలివిడి మనస్తత్వం కలదని ఇట్టే కనిపెట్టేసింది. పిల్లలను దగ్గరకు తీసుకుని వాళ్ళకి ఏం కావాలో అడిగి తెలుసుకుంది.


కాంతి పిల్లలు స్నానం చేసి వచ్చాక వేడి వేడి ఇడ్లీలు సర్వ్ చేసింది. ఇడ్లీ తింటూ కాంతి తమ్ముడితో అంది. "నువ్వింకా ఆఫీసుకి రెడీ అవలేదేమిట్రా!" అని. అందుకు నిఖిల్ "లేదక్కా ఈరోజు ఆదివారం కదా, అయినా నేను 15 రోజులు సెలవు పెట్టాను- నీవు వస్తున్నావని. అందుకే ఈ 15 రోజులూ మనం జాలీగా గడపాలి. దానికి ప్రారంభం ఈరోజునుంచే చేద్దాం. ఏమంటావు" అన్నాడు ఎంతో ఉత్సాహంగా.

ఆరోజు సాయంత్రం నిఖిల్, శిల్ప, పిల్లలూ కలిసి 'టైటానిక్' సినిమాకి వెళ్ళారు. ఆ తరువాత బయట ఏదో రెస్టారెంటులో భోజనం చేసి ఇంటికి వచ్చారు. అప్పుడు సమయం పది అయింది. ఇక తనకి కేటాయించబడిన గదిలో పిల్లలను పడుకోబెడదామని కాంతి పక్క సర్దుతూంటే, శిల్ప చేతిలో దిండూ దుప్పటితో వచ్చింది.

"వదినగారూ ఈ పదిహేను రోజులూ పిల్లలు మీ తమ్ముడితో పడుకుంటారు. నేను మీకు కంపెనీ ఇస్తాను" అన్నది.

కాంతి ఆశ్చర్యపోతూ అంది "అదేంటి శిల్పా మీరిద్దరూ కొత్తగా పెళ్ళైనవాళ్ళు కదా..నీవు నాతో పడుకోవటం ఏంటి! నో నో.. డోంట్ బీ సిల్లీ" అని నిరాకరించింది. కానీ శిల్ప అందుకు ఒప్పుకోలేదు. రాత్రి చాలాసేపు కాంతీ శిల్పా కబుర్లు చెప్పుకున్నారు. ఆ తరువాత శిల్పకి నిద్ర పట్టేసింది. కానీ కాంతి కంటికి మాత్రం నిద్ర కరువయింది. స్నేహశీలి అయిన శిల్పని చూస్తుంటే తనకి సరిగ్గా ఎనిమిదేళ్ళ క్రిందట తన జీవితంలో జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది.

అవి తనకి కొత్తగా పెళ్ళైన రోజులు. శ్రీధర్ తనూ ఎంతో ఆనందంగా ఒకరికి ఒకరుగా కలిసిపోయి, ఈ ప్రపంచంతో సంబంధం లేనంత డీప్‌గా గడుపుతున్న రోజులవి. శ్రీధర్ తల్లీ తండ్రీ విజయవాడలో ఉండడం మూలంగా తనకి అత్తామామల పోరు కూడా లేకుండాపోయింది. కానీ ఇంతలో తమ ఆనందాన్ని భగ్నం చేస్తూ తన వదినగారు ఇద్దరు పిల్లలతో చెప్పాపెట్టకుండా సడెన్‌గా దిగింది. పెళ్ళికి ఎలాగూ రాలేకపోయాను కదరా అందుకే మీ ఆవిడ్నీ, మీ కాపురాన్ని చూసిపోదామని వచ్చాను అంది. కానీ తనకి మాత్రం ఒళ్ళు మండిపోయింది. ఎంత పెళ్ళికి రాలేకపోతే మాత్రం, ఇలా క్రొత్తగా పెళ్ళైన వాళ్ళింటికి, ఎంత తమ్ముడైతే మాత్రం ఇలా మ్యానర్సు లేకుండా వచ్చేయటమేనా అని తను కోపంతో కుతకుతలాడిపోయింది.



అందుకే తన వదినగారితో కావాలనే అంటీ ముట్టనట్లు, ముభావంగా ఉండిపోయింది. దాంతో కాంతి వదినగారు చాలా హర్ట్ అయింది. నాలుగు రోజులకే తిరుగు ప్రయాణమైంది. తన తమ్ముడు శ్రీధర్ ఎంత బ్రతిమాలినా వినకుండా వెళ్ళిపోయింది. శ్రీధర్ ఏమీ అనలేదు. ఆ తరువాత ఈ ఎనిమిదేళ్ళల్లో ఒక్కసారి కూడా తమ ఇంటికి రాలేదు. అప్పట్లో తను చేసింది తప్పు అని తనకి అనిపించలేదు.

కానీ ఈరోజు తన మరదలు శిల్ప బిహేవియర్ చూసాక తను చేసింది ఎంత క్షమించరాని తప్పో తెలిసివచ్చింది. ఆమె మనస్సు పశ్చాత్తాపంతో రగిలిపోయింది. అవును..ప్రతీ ఆడపిల్లా పుట్టింటి నుంచీ, తమ అన్నదమ్ముల నుంచీ ఆశించేది ప్రేమాభిమానాలే కానీ ఆస్తిపాస్తులు కాదు. తను అది గ్రహించలేకపోయింది.ఈ గిల్టీ ఫీలింగ్స్‌తో ఆమెకు రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు.

★ ★ ★

నిఖిల్, శిల్పలతో రెండు వారాలు ఎలా గడిచిపోయాయో కూడా తెలీలేదు కాంతికి. ప్రతీరోజూ ఇంట్లో పనులు ముగించుకుని ఎక్కడికో అక్కడికి వెళ్ళేవారు. బయటికి వెళ్ళటం బోర్ కొడితే, ఇంట్లోనే కూర్చుని అక్కాతమ్ముళ్ళు తమ చిన్ననాటి కబుర్లు చెప్పుకునేవారు.

ఆఖరుకి వీడ్కోలు తీసుకోవలసిన రోజు రానే వచ్చింది. ఆరోజు శిల్ప స్పెషల్ లంచ్ ప్రిపేర్ చేసింది. నిఖిల్ అక్కకి ఒక కంచిపట్టుచీర కొన్నాడు. వదినగారికి పళ్ళూ, పూలూ తాంబూలంతో పాటు తాము కొన్న చీర కూడా పెట్టి ఇద్దరూ ఆమె కాళ్ళకు నమస్కరించారు. తమ్ముడూ మరదలూ చూపిస్తున్న ఆప్యాయతకు ఆమె కళ్ళు చెమర్చాయి ఆనందంతో. గద్గద స్వరంతోనే వాళ్ళిద్దరినీ కలకాలం పిల్లా పాపలతో వర్థిల్లమని ఆశీర్వదించింది.

శిల్పా, నిఖిల్ ఇద్దరూ స్టేషన్‌దాకా వచ్చి కాంతీ, పిల్లలను సాగనంపారు.

★ ★ ★

ట్రెయిన్ బెంగుళూరు స్టేషన్‌లో ఆగగానే, డోర్ దగ్గర నిలబడ్డ కాంతికి, శ్రీధర్ దూరం నుంచి చేయి ఊపుతూ కనిపించాడు. తనూ చేయి ఊపింది.

దగ్గరకి వచ్చిన శ్రీధర్ అడిగాడు భార్యని ట్రిప్ ఎలా జరిగిందని. "బ్రహ్మాండంగా జరిగింది ఒక్క మీరు లేని లోటు తప్ప" అంది భర్తతో. కారులో వెళ్తున్నప్పుడు కాంతి అన్నది శ్రీధర్‌తో.

"ఏమండీ నేను మిమ్మల్ని ఓ కోరిక కోరతాను. తీరుస్తారు కదూ అని అడిగింది"

అందుకు శ్రీధర్ "అదేంటి నా ప్రియాతిప్రియమైన భార్య ఏదైనా అడగటమూ నేను ఇవ్వకపోవటమూనా...నెవర్" అన్నాడు.

"అయితే వినండి. మనం ఈ సమ్మర్‌లో మీ అక్కా, బావగారిని మన ఇంటికి ఆహ్వానిద్దాము" అనేసి ఆగిపోయింది. భర్త ముఖంలో ఆశ్చర్యం సంతోషం కలగలిపిన మిశ్రమ భావాలను గమనిస్తూ మళ్ళీ తనే అన్నది. "అలా చూడకండి శ్రీ..నేను మనస్ఫూర్తిగా అంటున్నాను" భార్య మాటలలోని నిజాయితీని గుర్తించి శ్రీధర్ ఒక చేత్తో డ్రయివ్ చేస్తూ మరో చేత్తో భార్యని దగ్గరికి తీసుకున్నాడు ప్రేమగా.

**-మాధవపెద్ది ఉష (హైదరాబాద్)**